క్లుప్తంగా

స్టీల్‌ప్లాంట్ కేవీలో 'తల్లి పేరుతో మొక్క'



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–1లోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం తల్లి పేరుతో మొక్క కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ పథకంలో భాగంగా మొక్కలు నాటారు. వాటిని తమ తల్లుల పేరుతో అంకితం చేశారు. ఈ మేరకు మొక్కల వద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వంశీకృష్ణ మాట్లాడుతూ తల్లుల పేరుతో పిల్లలు మొక్కలు నాటడం గొప్ప కార్యక్రమం అన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిధిలో మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న అభయం సొసైటీ ప్రతినిధులు

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో చదువుతున్న తండ్రిలేని పేద విద్యార్థులకు అభయం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఆసరా పథకం పేరుతో రూ.80వేల విలువైన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, అభయం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు గణేష్, కల్యాణ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి అభినందన



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుంధతి

అగనంపూడి: గ్లో లాజిక్స్ సొల్యూషన్స్ సంస్థ విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 14 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. ఏడాదికి రూ. 5.2 లక్షల ప్యాకేజీతో ఉపాధి అవకాశాలు దక్కించుకున్న విద్యార్థులను అభినందించారు.

తొలి పెన్షన్ ఆలయ అభివృద్ధికి..



మొదటి పింఛన్ రామాలయ అభివృద్ధి కమిటీకి అందిస్తున్న రామ అప్పారావు

అగనంపూడి: తనకు అందిన మొదటి నెల హయ్యర్ పెన్షన్‌ను గ్రామ రామాలయ అభివృద్ధికి అందించారు పట్టా రామ అప్పారావు. రూ.19, 849లను గ్రామ పెద్దలు ఐఆర్‌సీహెచ్ అప్పారావు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు విందుల వరహాలు, సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి అప్పారావు, దాసరి వెంకటరమణ పాల్గొన్నారు.

సింహగిరిపై నూతన ప్రసాదాల తయారీ శాలకు స్థల పరిశీలన

సింహాచలం: సింహగిరిపై ప్రసాదాల తయారీకి నూతన శాల నిర్మాణానికి శనివారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం అన్న ప్రసాద భవనంపై అంతస్తుని ప్రసాదాల తయారీ వంటశాలతో పాటు లడ్డూలు చుట్టేందుకు, పులిహోర పంపిణీకి వినియోగిస్తున్నారు. దీంతో కింది అంతస్తులో భక్తులు అన్నప్రసాదం స్వీకరించేందుకు సరిపోవడం లేదు. ఈ తరుణంలో కొత్తగా భవనం నిర్మించి అందులోకి ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ సెక్షన్లను మార్పు చేసేందుకు కొన్నిరోజుల కిందట ప్రణాళిక వేశారు. ఈ మేరకు భవనం నిర్మించేందుకు అనువైన స్థలం కోసం ఈవో అధికారులతో కలిసి పరిశీలన చేశారు. త్వరలోనే కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు. భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మూడు నెలల కిందట నిర్మించిన రోడ్డు దుస్థితి



బురదమయంగా అరుణా థియేటర్ వెనుక రోడ్డు



ఆటోనగర్‌లోని పరిశ్రమల మధ్య రోడ్డు ఇలా..

రహదారులా.. బురద గుంటలా..



ఆటోనగర్‌లోని మరో రోడ్డు ఇలా..



పెదగంట్యాడ: ఆటోనగర్ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమయ్యాయి. మొత్తం బురదమయంగా మారాయి. అడుగు వేస్తే తీయలేని దుస్థితిలో ఉన్నాయి. ఈ రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఏపీఐఐసీ (ఐలా) ఆటో నగర్ పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే ఇక్కడి పరిశ్రమల యజమానులతో పాటు ఆయా సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది, పరిసర ప్రాంతాలు ప్రజలు రోజూ వస్తూ వెళ్తుంటారు. అయితే రోడ్లన్నీ పాడవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

కూరుకుపోతున్న వాహనాలు

భారీ వాహనాలు ఒక్కోసారి మట్టిలో కూరుకుపోతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ మూడు నెలల కిందట వేసిన రోడ్లు కూడా ధ్వంసమయ్యాయి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, స్లాగ్‌తో గోతులను కప్పేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఏటా వర్షాకాలంలో రహదారులు ఛిద్రమవుతున్నాయని అంటున్నారు.

భారీ వాహనాలకు ఇబ్బందులు

నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు వస్తుంటాయి. ఈ రోడ్లన్నీ గోతులమయం కావడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే రోడ్లే కీలకం.. అయితే రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం కారణంగా భారీ వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కేబుల్ నిర్మాణం కోసం తవ్వకాలు

పారిశ్రామిక ప్రాంతంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఏర్పాటు కోసం రోడ్ల పక్కన తవ్వేస్తున్నారు. తవ్విన తర్వాత వారి పనులు పూర్తి చేసి ఆపై మట్టిని సక్రమంగా కప్పకుండా వదిలేస్తున్నారు. దీంతో ఆ మట్టి మొత్తం రోడ్లపైకి వస్తోంది. చినుకు పడితే ఆ రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఆటోనగర్ రోడ్లు అంతటా గోతులే. వర్షాలు పడితే ఎక్కడ గొయ్యి ఉంది.. ఎక్కడ రోడ్డు ఉందో గుర్తించడం చాలా కష్టమని వాపోతున్నారు. కూటమి అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని పలువురు పెదవి విరుస్తున్నారు.

అప్పటి రోడ్లే..

పెదగంట్యాడలో ఆటోనగర్ ప్రారంభించిన సమయంలో వేసిన రోడ్లే ఇప్పటి వరకూ ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా కొత్తగా రోడ్లు నిర్మించకపోవడం శోచనీయం. ఈ ఆటోనగర్‌కు అనుకొని ఉన్న ప్రాంతాలు సత్యనారాయణపురం, వెంకన్న పాలెం, కొంగపాలెం, యాతపాలేనికి చెందిన వారికి ఇవే ప్రధాన రహదారులు కావడంతో వారంతా ఇక్కట్లకు గురవుతున్నారు.

నరక యాతన



అధ్వాన రోడ్లపై ప్రయాణం నరక యాతనగా మారింది. రాత్రి వేళల్లో వెంకన్నపాలెం, కండిపల్లి వీధి,సత్యనారాయణపురం, కొంగపాలెం గ్రామస్తులు ఈ మార్గంలో వెళ్లాలంటే నరకాన్ని చూస్తున్నారు. సరిగ్గా వెలగని వీధి దీపాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.అధికారులు చొరవ తీసుకోవాలని సమస్య పరిష్కరించాలి.

– గొందేశి పెదరెడ్డి, స్థానికుడు

అవస్థల మయం



ఆటోనగర్ రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎండా కాలంలో దుమ్ము ధూళి రేగుతోంది. వర్షా కాలంలో మొత్తం రోడ్లన్నీ బురదమయమవుతున్నాయి. ఆటోనగర్‌లో పని చేసే వారితో పాటు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

– కండిపల్లి వెంకటరమణ, స్థానికుడు

ఆరోగ్యంపై ప్రభావం



ఆటో నగర్ రోడ్లన్నీ మట్టిమయమైపోయాయి. దానికి తోడు భారీ వాహనాలు రాకపోకలు సాగించినప్పుడు పెద్ద ఎత్తున దుమ్ము ధూళి రేగుతోంది. అది కాస్తా ఇక్కడ పని చేసే వారితోపాటు వాహనాల వెనుక వచ్చే వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. రహదారులు అన్నీ గోతుల మయం కావడంతో వర్షపు నీటితో నిండిన గోతుల్లో వాహనాలు దిగబడి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– పి. త్రినాథ్‌రావు, స్థానికుడు

తత్కాల్‌కు వచ్చే నెల ఒకటి నుంచి ఆధార్ తప్పనిసరి

అగనంపూడి: మారిన నిబంధనల ప్రకారం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రైళ్ల తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం ఆధార్ కార్డు తప్పనిసరిగా నిర్ణయించారని తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ తెలిపారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా టికెట్ పొందాలనుకొనే వారు విధిగా ఆధార్ నంబర్ నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని కోరారు. తక్కువ వ్యవధిలో తత్కాల్ టికెట్లు బుకింగ్ ముగియనున్న నేపథ్యంలో ముందుగానే ఆధార్‌నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు.

చేనేత, హస్త కళలను ప్రోత్సహించాలి



హస్తకళా ప్రదర్శన ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం మధుసూదనరావు

ఉక్కునగరం: దేశ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు చేనేత, హస్తకళలు.. వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి ఎం. మధుసూదనరావు అన్నారు. చేనేత హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో కళాక్షేత్రంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన వస్తువులను ఒక చోట ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉక్కు ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సంఘం నిర్వాహకుడు హరీష్ మాట్లాడుతూ ప్రదర్శనలో అన్ని రకాల చేనేత వస్త్రాలు, హస్త కళలకు చెందిన వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. జూలై 27 వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు, కళాక్షేత్రం కార్యదర్శి డొక్కా నర్సింగరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం. త్రినాథ్, కోశాధికారి ఎస్. వరప్రసాద్, ఎం. వెంకటరమణ, జి. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రతినిధులకు సత్కారం



పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రతినిధులను శనివారం సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ నుంచి ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులు బసా రమణారెడ్డి, బి.వి. రామయ్య, కె. సోమేశ్వరరావులను యూనియన్ నాయకులు సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల పని చేసి ప్లాంట్ ప్రగతిలో విశేష సేవలు అందించారన్నారు. విధి నిర్వహణతో పాటు యూనియన్‌లో క్రియాశీలకంగా ఉంటూ అందరి మన్ననలు పొందారన్నారు. వారి రిటైర్‌మెంట్ జీవితం ఆరోగ్యం, ఆనందదాయకంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వై. వరలక్ష్మి, మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, జి. అప్పలరెడ్డి, బి. శశిభూషణరావు, పి. చంద్రయ్య, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో జగన్నాథస్వామి

అగనంపూడి: సుభద్ర, బలభద్రుని సహిత జగన్నాథస్వామిని శనివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు గురు సంతోష్ ఉత్సవమూర్తులను కూర్మావతారంలో అలంకరింపజేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవ మూర్తులను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో పద్మవతి, ఉత్సవ కమిటీ నాయకులు కరణం పైడిరాజు, మామిడి నాగేశ్వరరావు, గల్లా సాయి, నారపిని నాగమణి, కుసుంచి కుమారి, సిమ్మిటి వరదారాణి మొదటి పూజలు నిర్వహించారు. స్థానిక షిర్డీసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన బృందం భక్తిగీతాలాపన చేశారు. కార్యక్రమంలో కొయ్య వెంకటరమణారెడ్డి, కరణం జగదీష్, విందుల వరప్రసాద్ పాల్గొన్నారు.

లఘు ఉద్యోగ్ భారతి జిల్లా కమిటీ కార్యవర్గ ఎన్నిక



లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖ జిల్లా లఘు ఉద్యోగ్ భారతి నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం ప్రతినిధులు శనివారం ఎన్నుకున్నారు. గాజువాక ఆటోనగర్‌లో నిర్వహించిన ప్రతినిధులు సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జగపతి రాజు, పవన్‌జైస్వాల్, కోశాధికారిగా వరుణ్, ఉపాధ్యక్షుడిగా సత్య, సంయుక్త కార్యదర్శిగా నాగిరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల సమస్యలపై చర్చించారు. జిల్లా చాప్టర్ మాజీ అధ్యక్షుడు అట్లూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ఐపీ నిపుణులు పాల్గొన్నారు. పరిశ్రమలు ఖాయిలా పడే పరిస్థితుల్లో ఉన్నప్పుడు పారిశ్రామికవేత్తలు ఐపీ పెట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐపీ నిపుణులు విశ్వనాథశర్మ, నరేందర్‌రెడ్డి, సుజాత వివరించారు. ప్రభుత్వం, బ్యాంకుల మధ్య మధ్యవర్తిత్వం చేసి పరిస్థితుల నుంచి బయటపడేలా సహకరిస్తామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



దివ్య అలంకరణలో వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, శోడషోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహి మాతను భూ ఆధారిత పంటలైన దాన్యతల్పం మీద దివ్య అలంకరణ భూషితగా నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం రాత్రి లక్ష్య సాధన కోసం లక్ష్య వారాహీ హోమం నిర్వహించగా శనివారం రాత్రి స్వప్నవారాహీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా వారాహీ మాత మనకు స్వప్నంలో దర్శనమిచ్చి అమూల్యమైన సూచనలు చేస్తుందని భక్తుల విశ్వాసం. అదే విధంగా ఆదివారం రాత్రి తిరస్కరిణీ వారాహీ హోమం జరుగుతున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమం ద్వారా మాయా, భ్రాంతుల తొలగింపుతో పాటు ప్రతికూల శక్తుల నుండి రక్షణ కలుగుతుందన్నారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణ చేతుల మీదుగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలపై వివాదం

పారదర్శకత లోపించిందని అసోసియేషన్ ఆరోపణ

మహారాణిపేట: నగరంలో జరుగుతున్న సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బదిలీల్లో విధానపరమైన లోపాలు ఉన్నాయని, పారదర్శకత లోపించిందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మర్రి శేషుబాబు ఆరోపించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా జరగాల్సిన బదిలీలు.. కొందరు అధికారుల ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితా విడుదల చేయకుండానే బదిలీలు ప్రారంభించడం అన్యాయమని శేషుబాబు అన్నారు. న్యాయ బద్ధంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు



ధర్మాల శ్రీనును సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా... సమస్యలను పక్క దారి పట్టించేలా చేస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని 64వ వార్డు అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ ధర్మాల శ్రీను అన్నారు. 64వ వార్డు అధ్యక్షునిగా నియమించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను గంగవరం గ్రామంలోని సాయిబాబా ఆల యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి పాటుపడతానని చెప్పారు. అనంతరం రెండు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మోరు, పితాని అన్నవరం, కొవిరి బాపనయ్య, కదిరి సత్తెయ్య, డీఎల్‌బి నూకరాజు, కొవిరి ఆది, కంబాల మల్లేశ్వర రావు, సింగపూర్ రాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కదిరి భూలోక తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగలధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

కళాభారతిలో నేడు చతుర్గుణిత అష్టావధానం



ద్విశతావధాని బులుసు అపర్ణ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విశ్వనాథ సాహితీ పీఠం సంయుక్తంగా ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో అరుదైన చతుర్గుణిత అష్టావధానాన్ని నిర్వహించనున్నాయి. ప్రఖ్యాత ద్విశతావధాని బులుసు అపర్ణ ఈ అవధానాన్ని నిర్వహిస్తారు. 30 ఏళ్ల తరువాత విశాఖలో జరుగుతున్న మొట్టమొదటి భారీ సాహితీ కార్యక్రమం ఇదేనని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. సాధారణ అష్టావధానంలో ఎనిమిది మంది పృచ్ఛకులు ఉంటారు. అయితే, చతుర్గుణిత అష్టావధానంలో ఒకేసారి నాలుగు అష్టావధానాలు జరుగుతాయి. అంటే వేదికపై మొత్తం 32 మంది పృచ్ఛకులు ఉంటారు. ఇది అత్యంత కష్టతరమైన సాహితీ ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ పేరి రవికుమార్ పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. సాహితీ, సంగీత, సాంస్కృతిక ప్రియులందరూ ఈ నూతన ప్రక్రియను వీక్షించి ఆనందించాలని డాక్టర్ రాంబాబు కోరారు.

విస్తృతంగా యాంటీ మలేరియా ఆపరేషన్



సాక్షిలో ప్రచురితమైన కథనం



లంకెలపాలెం చెరువులో డ్రోన్‌తో ఆయిల్ పిచికారీ

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ మలేరియా విభాగం అధికారులు కదిలారు. యాంటీ మలేరియా ఆపరేషన్ శనివారం విస్తృతంగా నిర్వహించారు. బాబోయ్ దోమలు శీర్షికన సాక్షిలో శనివారం వెలువడిన కథనంపై స్పందించిన అధికారులు జోన్‌లోని వివిధచోట్ల నిల్వ ఉన్న నీటిలో డ్రోన్‌ద్వారా యాంటీలార్వా ఆపరేషన్ చేశారు. వివిధచోట్ల ఆయిల్ పిచికారీ చేశారు. వార్డుకు ముగ్గురు సీజనల్ వర్కర్ల చొప్పున ఇంటింటికీ వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టారు. పలుచోట్ల ఫాగింగ్ చేశారు. అవసరమైనచోట మెగా ఫాగింగ్ నిర్వహిస్తున్నామని సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



పూర్ణానందశర్మను సత్కరిస్తున్న దిబ్బపాలెం నాయకులు

అగనంపూడి: పార్టీ బలోపేతమే అజెండాగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు, 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గున్నంటి పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. అగనంపూడిలోని పార్టీ కార్యాలయంలో శనివారం దిబ్బపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పూర్ణాను సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకువెళ్లగలిగితే మనం పూర్తిస్థాయిలో విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి యలమంచిలి అప్పారావు, నాయకులు యలమంచిలి వరహా వెంకటరావు, కృష్ణ ప్రసాద్, విందుల వరప్రసాద్, యలమంచిలి నరసింహరాజు, చందునాయుడు, ప్రసాద్, యశోదకృష్ణ, గురుగిరీష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్క నాటుతున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డులోని అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణ సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలోని దేవాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. జగన్నాథస్వామి ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.పద్మావతి పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, సేవా సమితి అధ్యక్షురాలు చిత్తా జానకీదేవి, ఉపాధ్యక్షురాలు లక్ష్మి, ప్రతినిధులు చిత్తా శోభారాణి, రమాదేవి, వెంకటలక్ష్మి, విందుల తులసి, మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు పాల్గొన్నారు.